# మనిషి కాలిన వాసన

**సీ**తమ్మకి ఉరిశిక్ష పడ్డాది. రేపు ఏప్రిల్ 14 ఉదయం ఉరితీస్తారు. శంకర్రావు హత్యకేసులో సీతమ్మకి సహకరించి నందుకుగాను, గోవిందరావుకి మూడేళ్లు కఠిన కారాగార శిక్ష చెప్పేడు జడ్జి.

సీతమ్మ కూతురు కళావతికి నిన్న శ్రీరామనవమికి ఏడాది మీద ఆరునెలలు నిండాయి. ఆ పిల్ల నిజంగా కళావతే. కళ్లు చేప పిల్లల్లా మిలమిలా మెరుస్తాయి. మేలిమి బంగారు చాయ. ఏడాది తిరక్కుండానే అన్ని మాటలూ వచ్చేసేయి. కబుర్ల పుట్ట. దాని కడుపునిండా కబుర్లే. ఆ కబుర్లు ఆలకిస్తుంటేనే కడుపు నిండిపోతుంది. ఎంత ఆలోచనో గుంటకి. తల్లిని ఉరితీశాక ఆ పిల్ల గతి ఏం గాను ? నాయనమ్మా, తాతయ్యా వున్నారు. మేనమామా వున్నాడు. ఎవరన్నా చేరదీస్తారు - కాని సీత తనకూతుర్ని తనమరణానంతరం అనాధశరణాలయానికి పంపే ఏర్పాట్లు చేయింపించవలసిందని కోర్టువార్ని కోరుకున్నాది. సీత అన్న కళావతిని నేను పెంచుకుంటానన్నాడు. వాడికే తినడానికి తిండిలేదు. వాడింక దాన్నేం పెంచుతాడు ? పెళ్లాం పిల్లలకే ఠికాణా లేదు. కూలీ నాలీ చేసుకుని, నీ ఇంటా నీ ఇంటీ పనీపాటూ చేసుకుని కడుపు జరుపుకుంటున్నారు. వద్దు వద్దు వద్దు లెమ్మనీసిందందుకే సీతమ్మ.

సీతామహాలక్ష్మికి ముప్ఫయ్యేళ్లు సుమారుండొచ్చు. నాకంత ఖచ్చితంగా తెలియదుగాని - నాకంటే ఎంత లేదన్నా పదేళ్లు చిన్నదుంటుంది. పెద్ద అందాలరాశి కాదు. కాని మా చలాకీ అయినది. తెలివైనది. గుణవంతురాలు, సీతని సుశీలనే అనొచ్చు. సీతకి పదేళ్ల వయసులో తల్లి ధనుర్వాతం వొచ్చి చచ్చిపోయింది. తండ్రి పెంచిపెద్దచేసి పెళ్లి చేశాడు. జగన్నాధం దగ్గర బంధువుకాదు కాని తెలిసిన వాడే. తెలిసిన వాడు కదాని సంబరపడి పెళ్లిచేసాడు తండ్రి. కూతురు సుఖపడుతుందని మురిసిపోయేడు. పెళ్లయి ఏడాది తిరిగేసరికి ఒకనాటి సందెవేళ పొలం గట్టుమీద కట్లపాము కరిచి చచ్చిపోయేడు. ఆ రోజు లోకం అంతా చీకటిగ కనపడ్డాది సీతమ్మకి. ఎంత ఏడిస్తే మాత్రం ఏ దేవుడు కనికరిస్తాడు. ఇక మొగుడు తప్ప నా అన్నవాళ్లు వేరు. అన్న వున్నా లేనట్టే. జగన్నాధంగాడు - ఆ మొగడు చచ్చినోడు. - వాడే దానికి చావు తెచ్చి పెట్టేడు. వాడే గానిపెళ్లాన్ని తిన్నగా ఏలుకుంటే దానికీ చావురాకనే పోను. తాగుముచ్చునాయాల ఊరకుక్క. కడకి సీత బతుకిలా తెల్లారిపోతున్నాది. సీతమ్మ నవ్వితే సీతాకోక చిలకలెగిరినట్టుంటుంది. సీతమ్మ పలువరస ముత్యాల కోవ. మల్లిపూల మాల. సీత కొచ్చిన కష్టం తల్చుకుంటే కడుపులో చెయ్యిపెట్టి దేవినట్టుంటాది. ఎన్ని దణ్ణాలు పెడితే ఎన్ని మొక్కులు మొక్కితే ఏం లాభం? ఏ దేవుడు కాపాడతాడిప్పుడు ?!

మాయింట్లో పాలుపోసేది. మరగబెట్టిన నెయ్యితెచ్చేది. నెయ్యన్న నెయ్యికాదు. చక్కగా పూసకట్టిన నెయ్యి - ఘుమ ఘుమలాడే నెయ్యి - మావూరొదిలేక మళ్లీ కళ్ల చూడలేకపోయేను. సీత మనసు వెన్నకాచిన నెయ్యిలాగ అంతటా పరిమళిస్తుంది. సీతకి పెళ్లికావడం, దాని ముస్తాబు, ఆ సిగ్గుపడ్డం అంతా బాగా గుర్తుంది నాకు. మా అమ్మమ్మకి సీతమ్మంటే మా చెడ్డ యిష్టం. పాలు పొయ్యడానికొచ్చిన చిన్నారి సీతమ్మని - "ఏమే సీతాలూ, నా మనవణ్ణి పెళ్లాడతావేటే" అని మా యమ్మమ్మ హాస్యాలాడేది.

"కులం వేరయితే నేమీ - కులంలో ఏముంది ? అంతా నరుడి సృష్టి. సీత నిక్షేపంలాంటి పిల్ల" అని తెగమెచ్చుకునేది. పరికిణీ కుచ్చెళ్లు పట్టుకుని పరుగులు తీసేది పదేళ్ల సీత.

నేపప్పటికి స్కూలు ఫైనల్ పాసయ్యాను. నాకూ ఏదో ఆశగా వుండేది మనసులో. పెళ్లినాటికి సీతకి పదమూడో, పద్నాలుగో. సమర్తాడి ఏడాది తిరగకుండానే ఆ జగన్నాధంగాడికి కట్టబెట్టేసేరు. నా కప్పటికింకా పెళ్లే కాలేదు. ఉద్యోగ ప్రయత్నాల్లో తిరుగుతుండేవాణి. ఉన్న ఊరే ఇచ్చేరు సుఖపడుతుందని. "సీత కడిగిన ముత్యం-" అనీది మాయమ్మమ్మ. మా యమ్మమ్మ చేతిలోనే గనక పెత్తనం వుంటే సీత నా పెళ్లాం అయుండేది. కథ ఇంతదూరం వచ్చేదే కాదు. మాయమ్మమ్మ చెప్పినట్టు ఈ లోకం అంతా నరుడి నటన. నరుడు తల్చుకుంటే నల్లరాయయినా బద్దలేసిపోతుంది. సీత బతుకు బండలయిపోయింది. కడిగిన ముత్యంలాంటి సీత బతుకు మరొక మూడువారాల్లో తెల్లారిపోతుంది. ఆమె తరపున హైకోర్టుకు ఎవరు వెళతారు ? సీతమ్మ క్షేమం ఎవరిక్కావాలి. అందరికందరూ మొసలికన్నీరు కార్చేవారే. అత్తా మామ చాలా బాధపడ్డారు. అన్న ఆడదానిలా గొల్లున ఏడిచేడు. ఎవరు మాత్రం ఏం చెయ్యగలరు ?

ఆ రోజు ఊరు ఊరంతా తిరగబడి పోయిందట. మా అమ్మమ్మ నాకు అంతా చెప్పింది. ఎవ్వరూ నమ్మలేకపోయేరట. గంగిగోవులాంటి సీత మరిది శంకర్రావుని చంపిందా ? సీత చేతులు ప్రాణాలు తీసేయా ? ఎవరు చూసేరు ? ఎందుకసలిలా జరిగింది. చంకని బిడ్డతో సీతమ్మనీ,గోవిందరావునీ చేతులకి బేడీలు వేసి జీపెక్కించి తీసుకుపోయేరు శంకర్రావు శవాన్ని పట్నంలో పెద్దాస్పత్రికి కోతకి తీసుకుపోయేరు.

శంకర్రావు జగన్నాధం సొంత తమ్ముడు కాదు. దూరపు చుట్టం. సీతకి మరిది. సీతకంటే రెండుమూడేళ్లు చిన్నవాడేనట. వాడికేం పోయేకాలం వచ్చిందో సీతమ్మని లొంగదీసేసేడు. జగన్నాధం - కళావతి కడుపున పడ్డాక, నాగరత్నాన్ని మరిగి దాన్ని ఉన్నట్టుండి లేవదీసుకుపోయేడు. ఊరు ఊరంతా కుక్కుమీద వేలువేసుకున్నారు. నాగరత్నానిది ఎర్రతోలు. వన్నెల విసనకర్ర. షోకులాడి. అది రామప్పంతులు గారింట్లో తప్ప పుట్టింది. దాని అన్న పట్నంలో లాయరు. జగన్నాధాన్ని నరికేస్తానని లేచాడు. అరిచే కుక్క ఎక్కడ కరుస్తుంది? ఆ అన్న అరిచేకుక్క! అరిచి అరిచి తోకముడిచేశాడు. వాళ్లిద్దరూ బెంగుళూరో, బొంబాయో పారిపోయేరట. పట్నంలో బొంబాయి రైలెక్కడం శంకర్రావు చూశాడట. కాని జగ్గణ్ణే చూసేట్టకాని నాగరత్నం అవుపడలేదట. ఇద్దరూగాని కనపడితే తప్పక అడ్డుకునేవాడట. కోతలు కోతలు. ఎవణ్ణి ఎవడు అడ్డుతాడు. నాగరత్నం వంటినిండా నగల్తోనూ, చేతినిండా రొఖ్ఖంతోనూ గుమ్మం దాటేసింది. మార్చుకు తినేస్తే - ఎన్నాళ్లుంటుందా సొమ్ము? కొండలు కరిగి పోతాయి. వంటికి మైకం కమ్మిన వాళ్లు జల్సాఖర్చులు చేసేసే - కడకి - కడుపుకి తిండలేక మాడాలి. విధంచెడి, ఆకలి బాధతోనయినా ఇల్లు చేరకపోతుందా అని ఎదురుచూసేరు. రెండేళ్లు కావొస్తుంది. ఆ జాడలేదు. పేపర్లో వేయించారు. రేడియోలోనూ, టీవీలోనూ చెప్పించారు. దాని లాయరు అన్న అరెస్టు వారంటు కూడా పుట్టించేడట. ఏదీ మనిషిదొరికితే గదా ! దొరకనివాళ్లని పోలీసులు మాత్రం ఎక్కణ్ణించి పట్టుకుంటారు ? సీతమ్మ మాత్రం పోలీసులకి దొరికి పోయింది. గొడ్డలీ, కొవడలీ కూడా రక్తపుమరకల్తో సహా దొరికి పోయేయి. సీత శంకర్రావుని చంపుదామని కల్లో కూడా అనుకోలేదు. లేగదూడలాంటి సీతని - మొగుడు లేని పెళ్లాన్ని, మగతోడులేని ఆడదాన్ని, లొంగదీసేశాడు శంకర్రావు. అంతపని చేస్తుందా అన్నారు లోకులు. మొగుడులేడు - వయసులో వున్నాది.

ఉప్పూ, కారం తిన్న తరవాత తప్పుచెయ్యికేం చేస్తుందన్నారు. ఆ లోకులే ! - ఏం లోకం ఏం లోకం - సాక్ష్యం గట్టిగా వుంది. ఉరిశిక్ష పడిపోయింది. పాపం. దిక్కులేని వాళ్లకి దేవుడు మాత్రం దిక్కు చూపిస్తాడా ? దేవుడు ఆశ్రితపక్షపాతి కాదూ ? అంతా భ్రమ..... అంతా మాయ......

కళావతి జగ్గడి కూతురా ? శంకర్రావు కూతురా ? అని మీమాంస చేశారు, ఇరుగు పొరుగూను. కళ్లు పోతాయి కల్లుపోతాయి. జగ్గడు నాగరత్నాన్ని లేవదీసుకు పోయేనాటికి సీతకి అయిదోనెల. కళావతి కడుపులో వుంది. తప్పు-తప్పు - ఆ తరవాతే ఆ శంకర్రావు చచ్చినాడికి ఈ దుర్బుద్ధి పుట్టివుంటుంది మా అమ్మమ్మ. లోకులు కాకులు..... ఆ పిల్ల అచ్చు జగన్నాధం పోలికే. తండ్రి పోలిక ఆడపిల్ల అదృష్టవంతురాలట. మరిప్పుడు ఏమయింది? దానదృష్టం ముక్కలయినట్టేవుంది. పిల్ల భూమ్మీద పడేసరికి - తండ్రి తల్లినీతననీ నట్టేట ముంచేశాడు. ఇదుగో ఇవాళ తల్లికి ఉరిశిక్ష పడ్డాది. ఇహనేం అదృష్టం !! తండ్రిపోలిక ఆడపిల్ల అదృష్టవంతురాలు అన్నవాళ్లే - ఇప్పుడు నష్టజాతకురాలన్నారు. నోరా తాటిపట్టా ?. పాడు లోకం - లోకం గుడ్డిది.......

రాజమండ్రి సెంట్రలు జైలుకి వెళ్లి సీతని చూసొచ్చాను. సీత నాకు ఏమీ అవ్వదు. చిన్ననాటి కొడుకుని. తను పాలమ్మకునీ పాపాయ్మ కూతురు. కులమూకాదు - అంతస్తూ కాదు - ఎక్కడా పొత్తి లేదు. మీరు ఎవరు . సీత నాకేం అవుతుంది ? ఊహ్ ప్రేయసా ? సీత ఊర్వశి కాదు. దివినుంచి దిగివచ్చిన దేవకన్య కాదు. చదువు రాదు. గేదెల వెనక తిరుగుతూ పాలమ్ముకుంటుంది. పిడకలు చేస్తుంది. సీతకీ మాకూ పోలికేమిటి ? సీత అందగత్తెకూడా కాదనే చెప్పాలి. నాభార్య లోకం దృష్టిలో అందగత్తె. చదువుకున్నది. పెద్దింటి పిల్ల. కాని సీతకి - నాభార్యకీ పోలికేమిటి ? సీత మాట్లాడితే అమృతం కురిసినట్టుంటుంది. ముత్యాల జల్లులా వుంటాయి మాటలు. సీత హృదయం పాలసముద్రం..... ఎంతటెంతటి అందగత్తెలూ సీత కాలి గోటికి పోలరు. సీత కూతురుకి - తండ్రి పోలికా, తల్లి కళా వచ్చేయి. ఇప్పుడా పిల్ల దిక్కు లేనిదయిపోబోతుంది.

శంకర్రావుని నేనే చంపేనని సీత ఒప్పేసుకుంది. తన వల్ల జరిగింది తప్పేనని ఒప్పేసుకుంది. కాని - వాడు మృగం. తిన్నయింటి వాసాలు లెక్కపెట్టే దగుల్బాజీ. తల్లి రొమ్ముకోసే దుర్మార్గుడు, అది మానసిక హింసా, చిత్రహింసా, వేధింపా ? వాడొక విషపుకుట్టె - మరి మొదట్లో సీత ఎలా లొంగింది .... చెప్పలేం.... చెప్పలేం.... అంతస్పష్టంగా గుట్టువిప్పలేం .... కారణాలు వెదకలేం ... కష్టం .... ఆ భయంకర హింసను భరించడం కష్టం ..... అందుకే సీత తెగించింది

తనకి శిక్ష పడినపుడు ఏడవలేదు. ఒక్క మనిషి చచ్చిపోయినంత మాత్రాన ఈలోకం ఆగిపోతుందా ? అని ఎదురు ప్రశ్న వేసింది.

చంపాలన్న ఆలోచనే ఏకోశానా లేదు. ఆ క్షణాన కలిగిన బాధలోంచి వచ్చిన ఆవేశం అది. కర్రలు చీల్చే గొడ్డలితో ఒక్క పెట్టు పెట్టింది తలమీద.... శంకర్రావు బలిష్ఠుడు. తల రక్తమండలం అయిపోయింది. గొడ్డలిలాక్కుని సీతనే చంపబోయాడు. కొడవలి వుంది. కడుపులో గుచ్చి పేగులు చీల్చింది.... పెనువృక్షం ఒక్కటంటే ఒక్కసుడిగాలికి నిలువునా చీలి నేలకూలినట్టు కూలిపోయేడు. ఆ గొడ్డలీ, కొడవలీ గోవిందరావువి. అవి అతను తెచ్చి అందించలేదు. కాని వాటిని దూరంగా తొలగించలేదు. పరిస్థితి పసిగట్టి నివారించలేదు. సీతమ్మంటే అభిమానం అతగాడికి. చుట్టమూ కాదు పక్కమూ కాదు.

పొరుగు వాడంతే. అంతా క్షణాల్లో జరిగిపోయింది. తక్షకుడు నేలకూలాడు. విషసర్పం మన్ను కరిచింది. బలవంతమైన సర్పము చలిచీమల చేతచిక్కిచావదె సుమతీ .... సీత చలిచీమల్ని కూడా చంపి ఎరగని సుమతి ... సుగుణవతి.... చలిచీమలకి పంచదార వేసేది.... నూకలు చల్లేది .... సీతకి ఉరిశిక్షా ? సుశీలకి సత్యసంధురాలికి దుర్మరణమా ? దేవతా ఓ భూదేవతా .... తల్లీ ఓ గంగమ్మ తల్లీ .... సమస్త దిక్పాలకులారా ఓ చరాచరభూత ప్రపంచమా .... ఎందుకిలా జరిగిందెందుకిలా జరిగింది.... సీత హంతకురాలా ....సీతేగనక నేరస్తులయితే ఇహనీ ప్రపంచకంలో నేరస్తులు కానిదెవరు తండ్రీ ....

పేపర్లన్నీ ఈ వార్త ప్రకటించాయి. అంతా ఆలకించాను మా వూరొచ్చి. నాకు కన్నీళ్లాగాయి గావు. వాడిని చంపినందుకు నాకేం బాధ లేదన్నది. సీత నీతి తప్పిందా ? సీత శీలం కోల్పోయిందా ? సీత అంతా చెప్పేసింది, సీత అబద్ధం ఆడదు. సీత సత్యసంధురాలు....

చుట్టూ జనం సీతని వింతగా చూస్తున్నారు. జైలరు అదోకలా చూస్తున్నాడు. సీతంటే జాలిపడుతున్నట్టే వుందా చూపు. అయ్యోపాపం అన్నట్టేవుందా చూపు.. అయ్యో అయ్యోలవల్ల పనులు జరగవు గదా పాపం పాపం అంటే సమస్యలు పరిష్కారం కావు గదా -

కళావతిని ఎత్తుకుందామంటే వచ్చింది గాదు. ఆ పసిదాన్ని చూస్తుంటే నా గుండె తరుక్కుపోయిది. నాభార్య (ఏ భార్యా - బహుశా) ఒప్పుకోదు గాని - ఒప్పుకుంటే కళావతిని నేను పెంచుకుందును - ఏదో మిరకిల్ జరిగి సీత కి శిక్షతప్పితే - సీత మళ్లీ మన ప్రపంచంలోకి వస్తుందా? నాకు ?!? నాకో అత్యాశ .... సీత ఒప్పుకుంటే సీతని పెళ్లాడి కళ్లల్లో పెట్టి చూసుకుందును. నేను సంఘసంస్కర్తని కాను - సాటిమనిషిని - మానాభిమానాలూ ఆశలూ ఆవేశాలూ వున్న మామూలు మనిషిని - ఛ ఛ - సీత ఒప్పుకోదసలు. ముక్కుమీద వేలు పెట్టుకుని ఇంతలేసి కళ్లుచేసి మందలించే చూపుల్తో తప్పు తప్పు అంటుంది. సీతకి నీతి అవినీతీ తెలుసును. సీత తప్పుమాట ఆడదు. తప్పుపని చెయ్యదు. సీత నిప్పు, సీత నీతి తప్పదు. అహల్య కుంతీ, ద్రౌపదీ పతివ్రతలు కారా ? సీత అంతకంటే పతివ్రత. సీత నిప్పు. నిప్పుకి చెదలు పడతాయా ? అసాధ్యం .....

అసాధ్యాలే సాధ్యాలవుతున్నాయి. అన్యాయాలే న్యాయాలవుతున్నాయి. కోర్టుకి కళ్ళూ చెవులూ ఎక్కడివి ? సాక్ష్యం వుంటేచాలు. సాక్ష్యం చూపాలి. సాక్ష్యం చెప్పాలి. ఏది తప్పు ఏది రైటు ? ఏద ధర్మం ? ఏది ధర్మం ? నీతే అవినీతి అబద్ధాలు. బలం వున్నావాడివే నీతి. ధనం వున్నావాడిదే ధర్మం డబ్బుంటే సీతని బతికించవచ్చా ? హైకోర్టుకి వెళితే ? అక్కడ ఈ శిక్షఖాయమై సుప్రీంకోర్టుకి వెళ్ల వలసివస్తే ? అక్కడ ఒకవేళ కేసు కొట్టేసి సీతకి ఉరిశిక్ష రద్దయి యావజ్జీవ ఖైదు పడితే - అప్పుడు శిక్ష తప్పితే .... ఎందుకొచ్చిన ఆలోచనలు ... ఇవన్నీ జరిగేనా ? కాని సీత ముఖంలో ఆశా లేదు - నిరాశా లేదు.... కన్న కూతుర్ని ప్రేమగా పెంచుకోవాలని లేదూ ? ఆ కూతురికోసం బ్రతకాలని లేదూ ? ఎందుకు లేదూ ?

సీతకి తొలి చూలు మగపిల్లడు. వాడిది అచ్చు తల్లి పోలిక, ఏడాది పెరిగి చచ్చిపోయేడు. జాతకం చూసి, బిడ్డడు మహర్జాతకుడన్నారట. ఏలినాటిశని దోషం వుందనీ - అది దాటితే ఇక మహర్దశని చెప్పేరట. పట్టిందల్లా బంగారం జౌతుందన్నారట. జగన్నాధం పొంగిపోలేదు. సీతకి ఎందుకో

నమ్మబుద్ధికాలేదు. ఏమోలే అనుకున్నది. పిల్లడికి ఏడాదినిండే సరికి ఆయుష్షు తీరిపోయింది. ఏం జ్యోతిష్యమో ఏమో ..... జ్యోతిషానికి పార్వతీదేవి శాపం వుందట. శాస్త్రానికి శాపం ఏమిటి ? అసలది శాస్త్రం అయితే కద. బిడ్డ పోయినదుఃఖంలో సీత జ్యోతిషాన్ని నిందిస్తుందన్నారు లోకులు..... రెండోకాన్పు ఆడపిల్ల. చచ్చిపోయి పుట్టింది. ఆపరేషన్ చేసి వేశారు. సీత దురదృష్టవంతురాలు అన్నారంతాను. మూడో కాన్పు కళావతి - నా భార్యనాకు వారసుడినివ్వలేదు. నాకు సంసార సుఖం లేదు అంటూ గోల జగన్నాధం. ఒకనాడు ఆ సంగతులన్నీ మా అమ్మమ్మతో చెప్పి ఏడ్చుకుంది సీత. అనుకూలవతయిన భార్య దొరకడం నూటికీ కోటికీ ఎవరికో తప్ప సాధ్యం కాదు.

నేను సీతకన్నీళ్లు తుడవగలనా ? నేను సీతప్రాణం కాపాడగలనా ? నేను సీత కూతుర్ని పెంచి పోషించగలనా ? కేవలం మనసులో ప్రేమవుంటే సమస్యలు పరిష్కారమవుతాయా - మౌన ప్రేమ - సీతకి నేనంటే లోపల్లోపల ప్రేమ వుండే వుంటుంది. ఎంత చక్కగా అభిమానంగా పలకరిస్తుంది నేను కనపడితే. ఆ కళ్లల్లో ఎంత తియ్యటి నవ్వు .... ఆ నవ్వు ఇక కొన్నిరోజుల తరవాత వుండదు. సీతని ఉరితీసిచంపేస్తారు. కళ్ల ఎదురుగా ఇంత ఘోరకలి జరుగుతున్నా ఆపలేక పోతున్నాం మనం.. ఏం మనుషులం...

సీత శంకర్రావును హత్యచేసిందా ? లేదు వధించింది. హత్య వేరు వధ వేరు. మహిషాసురుణ్ణి వధించిన దుర్గను పూజిస్తారు కదూ. రావణుణ్ణి వధించిన రాముణ్ణి కొలుస్తారు కాదూ, మరి నరరూపక్రూర మృగం - విష జంతువు శంకర్రావు - ఆ విష జంతువును చంపడం కన్న లోకకళ్యాణం వుందా ?

సీతను ఈ లోకం హత్య చేస్తుంది. ఉత్తములైన సీతలాంటి వాళ్లని ఈ లోకం నిత్యం సజీవదహనం చేస్తున్నది. ఆ రోజు ఏప్రిల్ 14. ఆ ముందురోజు నిద్ర లేదు. ఆ రోజంతా సరేసరి. ఆ మర్నాడూ నిద్ర లేదు. ఏప్రిల్ 14 వెళిపోయింది. సీత లేకుండా సూర్యుడుదయించాడు. నా కళ్లు చింతనిప్పుల్లా వున్నాయి. నా శరీరం కాలిపోతున్నట్టు కమురు వాసన - మనుషుల్ని కాలుస్తున్న వాసన - సీతని కాల్చేసి వుంటారు. సజీవమైన సీత శవమై బూడిదై పంచభూతాల్లో కలిసిపోయింది. ఈ మట్టిలో కలిసిపోయింది. ఈగాలిలో కలిసిపోయింది. కళావతి - ఏణ్ణర్థం ఆడపిల్ల - తల్లి లేనిదయింది. అనాధ శరణాలయానికి చేరుంటుంది.

చిలకలూరిపేట బస్సుదహనం కేసులో నేరస్తుల్ని కాపాడగలిగింది ఉవ్వెత్తున లేచిన ఉద్యమం. కాని సీత విషయంలో జరిగిన ఉద్యమాలు సీతని కాపాడలేక పోయాయి. రాష్ట్రపతి క్షమాభిక్ష యివ్వలేదు. రాష్ట్రపతి కూడా మగవాడే కావడం కారణం కాదు - ఈ దుర్మార్గ వ్యవస్థ స్వభావమే అంత - ఉద్యమాలు వర్గపోరాట రూపం తీసుకోవాలి. పెద్దపామును చంపగల మరింత బలోపేతమైన ఆయుధంగా ఉద్యమాలు ఎదగవలసివుంది - బోఫోర్స్ భక్తులు ఏమయ్యారు ? స్కాముల స్వాముల్నెవరేం చెయ్యగలిగారు ? రణబీర్ సేన పదులకొద్దీ రైతుల్ని ఊచకోచ కోస్తుంటే ఏం చేశారు! - ఈ ప్రభుత్వం దోపిడీ ప్రభుత్వం - ఇది పురుషాధి పత్యదోపిడీ వ్యవస్థ - దుష్టరక్షణ - శిష్టభక్షణ -

సీత - సీత - సీతని బ్రతుకుండగానే కాల్చేశారు.... మనిషికాలిన వాసన - సజీవ దహనం - కమురు వాసన - అన్నం సయించదు - నిద్రపట్టదు - బయట ఎండాకాలం మండిపోతున్నది - నిప్పుల్లో సీత కాలిపోయింది - లోపల లోపల ఏదో కాలినవాసన - గుండెలు భగభగభగ మండిపోతున్న వాసన - పేగులు లోపల ఏదో తగలబడి పోతున్న వాసన - నా మెదడుకు నిప్పంటుకుంది -

ఏమిటండీ అలావున్నారూ - అన్నది మా ఆవిడ...... ఎలా వున్నానూ ?.... రాముడు సీతమ్మని అగ్నిప్రవేశం చేయించాడు. సీతమ్మని భూదేవత గుండెల్లో పొదుపుకుంది- అన్నాను. నా వేపు భయంగా వింతగా కొత్తగా చూసింది. నేను నేనులా లేనుగావును. ఎవరోలా వున్నాను గావును. నా చిన్ననాటి నేస్తం సీత లేదు. ఆమెకోసం ఒక్కకన్నీటి బొట్టు రాలలేదు. She passed away unwept గాలిలో మనిషికాలిన వాసన - ఈ మాటలు పైకే అన్నాను.

"ఛి ఛీ ఏం మాటలండీ అవీ .... లేవండి - లేచిస్నానం చెయ్యండి. టిఫిను సిద్ధంగా వుంది. లేవండి -"

నాకేం అర్థం కావడం లేదు. చుట్టూలోకం మామూలుగానే వుంది - అరె - అదెలాసాధ్యం - రూప్ కన్వర్‌ని సజీవంగా భర్తతోపాటు కాల్చెయ్యలేదూ ? ఆ కాలిన వాళ్లని ఎవరేం చెయ్యగలిగారు ? కనీసం - పది హేనురోజుల తరవాత వరకూ నోటిమాటగానయినా ఖండించలేక పోయాడు యువప్రధాని మిష్టర్ క్లీన్ - ! నైనా సాహ్నిని చంపి తందూరిపొయ్యి మీద కాల్చిన యువకాంగ్రెస్ నేతని ఏం చెయ్యగలిగేరు - ఎంతపెద్ద ఘోరనేరం చేసి తప్పించుకోగలిగితే అంత గొప్ప వాడన్నమాట - ఈ దుష్ట సంస్కృతి ఇలా సాగుతూనే వుంటుందిలా వూరుకుంటే !?. ఈ దుర్మార్గుల్ని పట్టుకు కాల్చేక్షణం రావాలి....

సీతలు కాలిపోతూనే వున్నారు. కళ్ల ఎదురుగానే ఈ ఘోరాలన్నీ జరిగి పోతున్నాయి. అబ్బా - వద్దు - వద్దు - ఎక్కడో ఏదో అంటుకుంది లోపల - మెదడు కాల్తున్న వాసన - మనిషి కుతకుత ఉడుకుతున్న వాసన - హబ్బ ఓహ్ - భరించలేను భరించలేనికభరించ......

వేయిపడగల విషసర్పం ఈ దుష్టవ్యవస్థ - దీని దుర్మార్గాన్నెదుర్కొన గలగాలంటే - లక్ష చేతుల, కోటిచేతుల, కోట్లకోట్ల పిడికిళ్ల ఉద్యమం నిర్మాణం కావాలి -

నేరమే అధికారమై రాజ్యం ఏల్తున్నప్పుడు. నిరోధించలేని ప్రతివాడూ నేరస్తుడికి సహకరించినట్టే - ఈ నేరభావం నన్ను నిరంతరం వెన్నాడుతూనే వుంది - సీతకి మనం ఏస్తూపం కట్టించగలం ? కట్టిన అమరవీరుల స్తూపాల్ని ఈ దుర్మార్గులు ఉంచుతున్నారా ?

అయితే - ఒకరోజు రాక తప్పదు - ఒక అక్టోబర్ విప్లవాన్ని - ఒక చైనీస్ విప్లవాన్ని ఎవ్వరాపగ్గుగారు - అప్పుడిక జగన్నాథాల పని సరి - శంకర్రావులు సీతల్ని నేరస్తుల్ని చెయ్యరు - కారంచేడులోనేకాదు ఏచోటా దళితులకిక భయంలేదు - నైనా సాహ్నిల భద్రతకు ముప్పులేదు - రూప్ కన్వర్‌ల ప్రాణాలకు ప్రమాదం లేదు - సీత ఉరిశిక్ష రద్దుకోసం జరిగిన ఉద్యమంలో స్త్రీ విముక్తి నాయకురాలు విమలకు గట్టి దెబ్బలు తగిలాయి. హైకోర్టుకు కేసును తీసుకువెళ్లిన బృందంతో నేనూ వెళ్లాను - విజయం సాధించలేకపోయి వుండొచ్చు కాని - ఇది ఇలాగే రేపూ ఎల్లుండీ ఆవలి ఎల్లుండీ కూడా ఇక జరగదు -

నా చుట్టూ ఈ కమురుకంపు ఈ మనిషికాలిన వాసన .... ఇది రేపు పగతీర్చుకుంటుంది - సీత. సీతా - సీతమ్మా - మహాసర్పయాగం తప్పదు - పన్నగాల పాపం పండక తప్పదు -

*రచన : 10 / 11 - 4 - 1998*